# సత్యవాక్యం

# The Word of Truth

క్రైస్తవ మాసపత్రిక

JANUARY 1998

## సంక్షిప్త వార్తలు

కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ నిర్వహించిన 13వ గొప్ప బైబిల్ సెమినార్ మరియు ఏషియన్ బైబిల్ లెక్చర్‌షిప్ డిశంబరు 7వ తేదీనుండి 12వరకు విద్యుత్ నగర్‌లోని స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ భవన సముదాయములో అత్యంత వైభవముగా నిర్వహించబడెను.

అమెరికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియా, ఫిలిఫైన్స్ థాయ్‌లాండ్, నేపాల్, బంగ్లాదేశ్ నుండి 25మంది విదేశీసోదరులు సతీసమేతముగా హాజరైరి. అదే రీతిగా ఇండియాలోని అనేక రాష్ట్రములలోనుండి సువార్తికులు, ప్రముఖులు, వరంగల్ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్, హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్, సౌత్ మద్రాస్ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్, కలకత్తా స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ డైరక్టర్స్ వారి విద్యార్థి బృందములతో వేలకొలది సోదర సోదరీమణులతో హాజరైరి. సెమినార్ ఆరంభ కాలానికి భవన సముదాయము మరియు పెర్రికోతమ్ సెమినార్ హాలు ప్రాంగణమంతా నిండిపోయినది. రాత్రివేళలలో స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ భవంతి రంగురంగుల విద్యుత్ దీపములతో అలంకరించబడి అనేకులకు కన్నులవిందు కావించెను.

బ్రదరు జాన్‌ఫోర్డు గారు, డేన్‌ఫోర్డు గారు, ఐరారైస్‌గారు చక్కగా, శ్రావ[illegible] దేవుని వాక్యమును బోధించి అనేకుల హృదయాలను ప్రభువు తట్టు ఆకర్షించబడు నట్లుగా జేసిరి. డార్సీస్ట్రా గారు, బేరిగ్రైడర్ గారు, కెవిన్ మూర్ గారు, జేసన్ [illegible] గారు, మైఖేల్ సాహ గారు, డేవిడ్ చు గారు, జిమ్‌వాల్టరన్ గారు, కెన్ విల్లిస్ గారు, ఫ్రెడ్ స్టేన్ క్లిఫ్ గారు, రాజర్‌రైట్ గారు, ఎడ్డీ ఈ గారు లాసన్ మేయో గారు, లీ డేవిస్ గారు, గార్లండ్ ఎల్కిన్స్ గారు, ఫ్రాన్సిస్ డేవిడ్ గారు, శ్యామ్ సలామ్ గారు, మరియు స్వామిదాస్ గారు, "ఏసుక్రీస్తు దేవుని కుమారుడు" అను అంశమును అనుసరించి దేవుని వాక్యమును బోధించి అనేక హృదయాలలో ఆదరణ, ఉత్తేజము కలిగించుటయే గాక ఆనందముతో నింపిరి. విదేశీ సోదరుల ఉపదేశములను సరళమైన అచ్చతెలుగు భాషలో నెహెమ్యాగూటం గారు అనువదించిరి. అంతియేగాక "క్రీస్తు ప్రేమ " అను అంశమును చక్కగా బోధించిరి. ఆ ప్రసంగము విదేశీ, స్వదేశీయుల హృదయమును ఆకట్టుకొనెను. సోదరులు Ch. సద్గుణరావు ,T.V.N. కుమార్ గార్లు అనువదించుటలో సహాయపడిరి.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884-63722**

**Editor :** **Managing Editor :**

**J.C.CHOATE** **JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 18 జనవరి 1998 సంచిక 6


## సంపాదకీయం

## ఇది నమ్మతగినది

## ( Is it Beliveable )

బైబిలు అను పదమునకు గ్రంథము అని అర్ధము. అది నాలుగువేల సంవత్సరములకంటె పాతది. బైబిలుకు సాటియైన గ్రంథము ఈ ప్రపంచమందు లేదు. ఉండబోదు కూడ! అది కాలపరీక్షలనన్నిటియందును దృఢముగ నిలిచి యున్నది. బైబిలును, దాని బోధలను ఎరిగినవారు దానియందు బహుగా విశ్వాస ముంచెదరు. మరియే గ్రంథముకూడ జవాబు చెప్పలేనట్టి కొన్ని మానవ సమస్యలకు బైబిలు జవాబిచ్చుచున్నది. మానవుని ఆది అంతములను అది అతనికెరుక పరచు చున్నది. అంతేకాదు-అతడు తన జీవితకాలమంతయు దేవునియెడల నమ్మకముగా నున్న యెడల అతడు చనిపోయినను తిరిగి బ్రతుకునని అది బోధించుచున్నది. బైబిలును సమ్మతించువారు, దానిని దేవుని వాక్యమని నమ్ముదురు. విశ్వాసము వలన బైబిలు దేవుని వాక్యమై యున్నదని చెప్పవచ్చును. ఏలయనగా విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటియొక్క నిజస్వరూపమును అదృశ్యమైనవి యున్నవనుటకు ఋజువునై యున్నది. గనుక ఆ విశ్వాసము గ్రుడ్డిది కాదుగాని, అది అనేక-

పునాదులపై ఆధారపడియున్నది.

బైబిలు 66 పుస్తకముల సంపుటియై యున్నది. దానిని 40 మంది 1600 సంవత్సరముల కాలములో వ్రాసిరి. ఒకడు మరియొకడు వ్రాసినదానిని గాని, లేక వ్రాయబోవు దానినిగాని ఎరిగి యుండలేదు. వారిలో కొందరు గొఱ్ఱెలకాపరులు, కొందరు జాలరులు, ఒకడు వైద్యుడు, మరియొకడు ద్వేషింపబడిన సుంకరి. వారు వివిధకోణముల ద్వారా అనేక అంశములను గూర్చి వ్రాసిరి. అయినను వారి వ్రాతలను మనము ఏకీభవించి చూచిన, వారు ఒకే ప్రాముఖ్యాంశమును గూర్చి, అనగా మానవరక్షణను గూర్చి వ్రాసినట్లు తెలిసికొనగలము.అందేవిధమైన స్వవిరుద్ధ సంగతులు లేక బ్రహ్మాండమైన ఏకీభావము కలదు. బైబిలు లేఖకులు వివిధ కాలములలో జీవించినను, వారిని నడిపించిన "ఆత్మ" మాత్రము మార్పు లేనిదై యున్నదనుట నమ్మతగినది. అది దేవుని ఆత్మయే! వివిధ కాలములలో జీవించిన 40 మంది పురుషులు, దైవావేశము లేకయే అట్టి బ్రహ్మాండమైన ఏకీభావముగల గ్రంధమును తయారుచేయుట అసాధ్యము.

విజ్ఞానశాస్త్ర ప్రకారము బైబిలు యధార్ధమైనది. 18వ శతాబ్దపు అంతమందు హెర్బర్ట్ స్పెన్సర్ అనునతడు-"మానవ జ్ఞానమునకు అందనట్టి అయిదు స్పష్ట సంగతులున్నవి. అవేవన: "కాలము, శక్తి, క్రియ, రోదసీ లేక మహాకాశము, పదార్ధము అనునవి" యని లోకమునకు ప్రకటించెను. ఇది గొప్ప శాస్త్రీయ సిద్ధాంతమువలె పొగడబడెను. అయితే ఇదిగో మనము బైబిలును చూచిన అందలి మొదటి వచనమే ఈ అయిదు శాస్త్రీయ సూత్రములతో నిండి యున్నది. అది ఇట్లు నుడువు చున్నది-ఆదియందు (కాలము) దేవుడు (శక్తి) భూమిని (పదార్ధము), ఆకాశమును (రోదసీ) సృజించెను (క్రియ)". దేవుని వాక్య లేఖకుడగు మోషే ఈ అయిదు స్పష్టసంగతులను ఎరిగియుండెనా? లేక అతడు దేవునిచే నడిపింపబడెనా? దీనిని ఏమని చెప్పుదుము?

అనేక సంవత్సరముల తరబడి భూమి బల్లపరుపుగా నుండెనని ప్రజలు భావించిరి. 15వ శతాబ్దములో కొలంబస్ అనునతడు భూమి గుండ్రముగా

నున్నదని చెప్పగా, అతడు హేళన చేయబడెను. అటు తరువాత మెజెల్లన్ అనునతడు భూమిచుట్టు పయనించిన తరువాతనే భూమి అంతరిక్షములో వ్రేలాడునొక గోళము అని జనులు విశ్వసించిరి. అయితే దానికి కొన్నివేల సంవత్సరములకు ముందే, "ఆయన (దేవుడు) భూమండలము (Circle) మీద ఆసీనుడై యున్నాడు" అని యెషయా బైబిలునందు వ్రాసెను (యెష 40:22). "మహాజలముల మీద ఆయన మండలమును నిర్ణయించెనని" సొలోమోను వ్రాసెను (సామె8:27). భూమి గుండ్రముగా నుండెనని మనుజులు తెలిసికొనక కొన్ని వేల సంవత్సరములకు ముందే ఈ సంగతులు బైబిలునందు వ్రాయబడెను.

భూమి దేనిపై ఆధారపడి యున్నది యను అంశమును గూర్చి కూడ అనేక సిద్ధాంతములుద్భవించెను. అట్లాసు అనునతడు భూమిని తన భుజములపై మోయుచుండెనని భావించిరి. మరికొందరు అంఖదు ఏనుగులు దానిని మోయుచున్నట్లు తలంచిరి. అయితే "ఆయన శూన్యముపై భూమిని వ్రేలాడచేసెను" అని బైబిలు చెప్పుచున్నది (యోబు 26:7). నేటికింకను మానవులు కనుగొనుచున్న వందలకొలది అట్టి వైజ్ఞానిక సంగతులు ఈ గ్రంధమందిమిడియున్నవి.

దూరదర్శిని సహాయమువలన ఖగోళశాస్త్రము నేడు బహుగా అభివృద్ధి చెందినది. ఆకాశమందలి నక్షత్రములు లెక్కింపనగునని మానవులు ఒకప్పుడు తలంచితిరి. అయితే ఈ దూరదర్శిని వలన నక్షత్రములు లెక్కింప తరముగాదని ఇప్పుడు ఋజువైనది. క్రీస్తు పూర్వము1500 సం॥ల క్రితమే ఆకాశ నక్షత్రములు లెక్కింప తరముగావని మోషే వ్రాసిన సంగతిని ఇది మనకు జ్ఞప్తికి తెచ్చుచున్నది (ఆదికాండము 15:5).

బైబిలునందలి ప్రవచనముల నెరవేర్పును బట్టి అది నమ్మతగినది ఆయా రాజ్యములను గూర్చియు, పట్టణములను గూర్చియు, జనాంగములను గూర్చియు వందలకొలది ప్రవచనములున్నవి. ఈ ప్రవచనములు వాటి నెరవేర్పుకు, కొన్నివందల లేక వేల సంవత్సరములముందే చెప్పబడినను, అవి అక్షరాల నెరవేరెను.

పాత నిబంధన ప్రవచనముల నెరవేర్పే యేసుక్రీస్తు. పాతనిబంధనలోని అనేక మాదిరులు క్రీస్తును సూచించుచున్నవి. ఆయన జననము, జీవము, మరణము, పునరుత్థానములను గూర్చిన ప్రవచనములన్నియును ఖచ్చితముగా నెరవేరినవి. నిజానికి యేసుక్రీస్తు బైబిలునకు ఆదియు అంతమునై యున్నాడు. పాతనిబంధనలోని ఆఖరిపుస్తకము క్రీస్తు పూర్వము 450 సం॥లకు ముందే వ్రాయబడినందున, క్రీస్తును గూర్చిన ఆఖరి ప్రవచనము అది నెరవేరుసరికి 400 సం॥ల పాతదై యుండెనన్నమాట! వానిలో కొన్ని 8,9,10 వందల సం॥లకు పైగా యున్నపుడు నెరవేరినవి. అందుచే దానిని ప్రవచించిన వ్యక్తి తన ప్రవచన నెరవేర్పును గూర్చి ఇసుమంతయును కూడ తన పలుకుబడి నుపయోగించుకొన వీలులేకున్నది. దీనినిబట్టి దేవుడు తన సేవకుల ద్వారా పలికిన సంగతులపై సమస్తాధికారమును ఆయనే కలిగి యుండెననుట బహు నమ్మతగినది!

బైబిలు అభివృద్ధి చేయతగని గ్రంథము. మానవుని పనులెన్నడును పరిపూర్ణములుగావు. నేటి తన యంత్రములు రేపటి తరములో మార్చబడుచున్నవి. నిన్నటి తన శాస్త్రీయ గ్రంథములు నేటి పరిహాస గ్రంథము లాయెను. అయితే బైబిలునందు సరిదిద్దవలసిన సంగతులేమియునులేవు. నేటి ఆధునిక జ్ఞానము ప్రబలక కొన్ని వందల సంవత్సరములకు ముందునుండే బైబిలు ఈలోకమందు గలదు. అది అభివృద్ధి చేయతగనిది గనుక అది తప్పక భగవత్కృషియే అయి యుండుననుట విశ్వాసనీయమైనది. బైబిలు సంఘటనలు చారిత్రకముగాను, భౌగోళికముగాను యధార్థమైనవి. బైబిలు యధార్థతను గూర్చి మన మనేక సంగతులను చెప్పుకొన వచ్చును. అది మానవునికి దేవునిచే బయలుపరచబడిన గ్రంథము. పాపనరుడు రక్షింపబడుటెట్లో అది బోధించుచు, నీతి మార్గములనతనికి గరపుచున్నది. గనుక ప్రియ చదువరీ! నీవు జ్ఞానివగుటకు దానిని పఠించుము. రక్షించబడుటకు దానిని నమ్మి లోబడుము. దాని పఠనము నిజానికి లాభదాయకమైన ఆనందమును సహాయకరమైన హెచ్చరికనై యున్నది. బైబిలుగ్రంథము యధార్థమని,అది నమ్మతగినదని మరచిపోవద్దు సుమీ!

# దేవుని మార్గములు ఖచ్చితమైనవి

## ( God's ways are Absolute )

ఈలోక రాజ్యములన్నిటిని వాటి మహిమను నీకిచ్చెదనని అపవాది యేసుతో అనినప్పుడు ఆయన "ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింప వలెను" అని జవాబిచ్చెను. ఈ విషయములో దేవుడు చాల ఖచ్చితముగమాట్లాడెను: "పైన ఆకాశమందే గాని క్రింద భూమియందే గాని భూమిక్రింద నీళ్ళయందే గాని యుండు దేని రూపమునయినను విగ్రహమునయినను నీవు చేసికొనకూడదు; వాటికి సాగిలపడకూడదు; వాటిని పూజింపకూడదు. ఏలయనగా నీ దేవుడనైన యెహోవానగు నేను రోషముగల దేవుడను; నన్ను ద్వేషించు వారి విషయములో మూడు నాలుగు తరములవరకు తండ్రుల దోషము కుమారుల మీదికి రప్పించె దను" (నిర్గమ 20:4,5). దేవుడు తాను పలికినది ఉద్దేశించి పలికినట్లు పాతనిబంధన పదేపదే మనకు సూచించుచున్నది. పాతనిబంధనలోని ఋజువుల సారాంశ మంతయు యిది: దేవుడు విగ్రహారాధనను ద్వేషించుచున్నాడు.

పరుల మార్గములు అసత్యమని తన మార్గమే సత్యమని యేసు చెప్పుచున్నాడు. "ఇరుకుద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆదారి విశాలమునై యున్నది, దానిద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆదారి సంకుచితమునై యున్నది, దానిని కనుగొనువారు కొందరే" (మత్తయి 7:13,14). మరల ఆయన ఇట్లనుచున్నాడు: ఆయన మాటలు విని వాటి చొప్పున చేయు ప్రతివాడును బుద్ధిమంతుడు. అయితే ఆయన మాటలు వినియు వాటిచొప్పున చేయనివాడు బుద్ధిహీనుడగును (మత్తయి 7:24-27).

ఆయన మాటలను మరల విందము: "నేనే మార్గమును, సత్యమును, జీవమును; నాద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" (యోహాను 14:6). "కాగా మీ పాపములలోనే యుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని. నేను ఆయనననని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే

యుండి చనిపోవుదురు" (యోహాను 8:24). "పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది" అని ఆయన చెప్పెను. దీనిని బట్టి ఆయన ప్రభుత్వమునకు తప్ప మరియే ఆత్మీయ ప్రభుత్వమునకు తావులేదు. మానవుల విశ్వాస ప్రమాణములకు తావులేదు. దేవుని ఖచ్చిత ప్రణాళికలో (Absolute Plan) డినామినేషనులకు ఏమాత్రము తావులేదనే ముగింపు ఇందులో ఇమిడియున్నది.

మీరే రైటు, మిగిలిన వారందరు తప్పు అని మీరనుకొనుచున్నారని కొందరు అప్పుడప్పుడు నాతో అంటూ యుంటారు. అట్టివారు గ్రహించుకొనలేరు. యేసే రైటని నా విశ్వాసము. బైబిలు మాత్రమే సరియని, మిగిలినదంతయు సరికాదని నేను నమ్మెదును. దేవుని వాక్యముతో నేను ఏకీభవించ లేకపోయిన యెడల నాదే తప్పు.

క్రీస్తుకును ఆయన సంఘమునకున్న విషయములలో దేవుని వాక్యమునకు మానవకల్పిత సిద్ధాంతములకున్న పోరాటము మిగిలిన సంగతులన్నిటికంటే హెచ్చుగా కన్పడుచున్నది. ఎఫెసీ 4:4లో శరీర మొక్కటే యని ఆ లేఖకుడు వ్రాసెను. ఎఫెసీ 1:22,23లో ఆ శరీరమే సంఘము అని పరిశుద్ధాత్ముడు ప్రకటించెను. సంఘము అనేక శరీరములతో సమకూడి యున్నదనియు, వేర్వేరు డినామినేషనులు అన్నియు కలసి సంఘమై యున్నదనియు మానవులు అందురు. నీవు దేవుని ఖచ్చితమైన బోధను అంగీకరింతువా? ఒక్కటే శరీరమున్నది. ఆ శరీరమే సంఘమై యున్నది.

సంఘము ద్వారా మానవులు దేవుని సదాకాలము సేవింపవలెనని దేవుడు కోరుచున్నాడు (ఎఫెసీ 3:21).

మనము ఇప్పటివరకు చూచినట్టియు చూడగల్గునట్టియు విషయాల్లో దేవుని మార్గము ఎంత ఖచ్చితమైనదో ఆయన రక్షణ మార్గముకూడ అంతే ఖచ్చితమైనది. నమ్మువానిని రక్షించుటకు సువార్త దేవునిశక్తియై యున్నది (రోమా 1:16).

ప్రకటింపబడిన సువార్తను మనము నమ్ముదుము (మార్కు 16:15). దేవుని మనము మితము చేయలేము గాని దేవుడే తన్నుతాను మితము చేసికొనిన దానిని గుర్తించెదము.

దేవుని మార్గము ఖచ్చితమైనదని జ్ఞాపకముంచుకొనుచు ఒక హెచ్చరిక ద్వారా ఈ పాఠమును ముగించుకొందము: "క్రీస్తు బోధయందు నిలచియుండక దానిని విడిచి ముందుకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు; ఆ బోధయందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు" (2యోహాను :9).

- జె.సి. బెయిలీ.

## సువార్త వినకుండా చనిపోయినవారు నశింతురా?

( Will those who die with out hearing the Gospel Be lost ? )

క్రీస్తు సువార్త వినకుండా చనిపోయిన వారు నశింతురా ? యని కొందరు అడుగుదురు. సువార్తను ఎన్నడు వినని వారు నశించరు అనియనుకొనేవారు, ఏసుగని వానిని నరకములో పడవేయుట దేవుని తత్వమునకు భిన్నమైనదని అంటారు. మరియు సువార్తను వినని పాపికి దేవుని చిత్తము తెలియదు గనుక అట్టివాడు దేవుని జవాబుదారి కాదంటారు. ఇట్టి ఆలోచన దేవుని వాక్యముతో ఏకీభవించుచున్నదా ? ఎరుగక పోవడం (అజ్ఞానం- Ignorance) ను గూర్చి కొన్ని ప్రాముఖ్య సంగతులు గమనించుదాం.

ఎరుగని వారందరిపైన యేసు ప్రతిదండన చేయును: "ప్రభువైన యేసు తన ప్రభావమును కనుబరచు దూతలతో కూడ పరలోకమునుండి అగ్నిజ్వాలలో ప్రత్యక్షమై దేవునినెరుగని వారికిని మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునప్పుడు మిమ్మును శ్రమ పరచువారికి శ్రమయు, శ్రమపొందుచున్న మీకు మాతోకూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి

న్యాయమే" (2థెస్స 1:6-8). ఎరుగని వారిపైనను, లోబడని వారిపైనను శిక్ష విధించబడుచున్నట్లు ఇక్కడ గమనించుము. సత్యము నెరుగని వారికి శిక్షవిధించుట దేవుని నీతియుక్తమైన తత్వమై యున్నదని బైబిలు బోధించుచున్నది.

అజ్ఞానము పాపము, దానిని గూర్చి మారుమనస్సు పొందవలెను: పాత నిబంధన కాలములో తెలియక చేసిన పాపముల నిమిత్తము ప్రాయశ్చిత్తము జరగించబడేది. ".... తెలియకయే పాపము చేసినవాని నిమిత్తము యాజకుడు ప్రాయశ్చిత్తము చేయును; వాని నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయుటవలన వాడు క్షమాపణ నొందును" (సంఖ్యా 15:28). అజ్ఞానులైన వారు మారుమనస్సు పొందాలని క్రొత్తనిబంధన ఆజ్ఞాపించుచున్నది. "సహోదరులారా, మీరును మీఅధికారులును తెలియక చేసితిరని నాకు తెలియును.... గనుక మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తము మారుమనస్సు నొంది తిరుగుడి" (అపొ.కా. 3:17,19). ఈ ప్రజలకు తెలియక పోయినను వారు మారుమనస్సు నొందితేనే గాని పరలోకమునకు వెళ్లలేరని తెలియజేయబడినది.

భక్తిగల అజ్ఞానులు కూడ నశించిపోదురు: యేసు ఇట్లనెను: "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రిచిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును. ఆ దినమందు అనేకులు నన్ను చూచి- ప్రభువా ప్రభువా మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములను వెళ్లగొట్టలేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు నేను మిమ్మును ఎన్నడును ఎరుగను, అక్రమము చేయువారలారా, నాయొద్దనుండి పొండని వారితో చెప్పుదును" (మత్తయి 7:21-23). వీరు పైకి భక్తి గలవారైయుండి రక్షింపబడి పోయామనుకొన్నారు. అయితే యేసు వారిని ఎన్నడు ఎరుగలేదని చివరకు తెలిసికొన్నారు. నరకపాత్రులయ్యారు. ఇది అన్యాయమని కొందరు అనుకోవచ్చును. అయితే లేఖనములను జాగ్రత్తగా పరిశీలిస్తే యేసు యొక్క తీర్పు న్యాయమైనదని గ్రహించుకోగలము.

అజ్ఞానులను శిక్షించుట బైబిలును బట్టి యుక్తమే. ఈదిగువ పేర్కొనిన అజ్ఞానులను దేవుడు రక్షించి యదార్థవంతుడు కాజాలడని మనము గమనించు కొనవచ్చును.

నిర్దేవులు నాస్తికులు: దేవుడు లేడనేవారు నాస్తికులు. దేవుడున్నాడో లేదో యనుకొనేవారు నిర్దేవులు. అట్టి అవిశ్వాసులను గూర్చి అపో.పౌలు ఇట్లు వ్రాసాడు: "దుర్నీతిచేత సత్యమును అడ్డగించు మనుష్యులు యొక్క సమస్త భక్తిహీనత మీదను దుర్నీతిమీదను దేవుని కోపము పరలోకమునుండి బయలు పరచబడు చున్నది. ఎందుకనగా దేవుని గూర్చి తెలియశక్యమైనదేదో అది వారి మధ్య విశదమై యున్నది. దేవుడు అది వారికి విశదపరచెను. ఆయన అదృశ్య లక్షణములు అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి గనుక వారు నిరుత్తరులై యున్నారు" (రోమా 1:18-20). సృష్టియే దేవుని ఉనికిని గూర్చి చెబుతున్నది గనుక ఆయన నెరుగకుండుటకు వారికి సాకు యేమీలేదు. అట్టివారిని శిక్షించుట దేవునికి న్యాయమే . నాస్తికులను దేవుడు బుద్ధిహీనులని పిలుచుచున్నాడు (కీర్తనలు 14:1).

విగ్రహారాధికులు: దేవుని సృష్టమైన దేనినైనా ఆరాధించుట కేవలం మూర్ఖత్వమే. అంతేకాదు మానవునిచే చెక్కబడిన ప్రతిమలను ఆరాధించుట మరింత మూర్ఖత్వమే. అయినను అజ్ఞానులైన అనేకులు విగ్రహాలకు మ్రొక్కుదురు. "వారు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమ పరచలేదు., కృతజ్ఞతాస్తుతులు చెల్లింపను లేదు. గాని తమ వాదములందు వ్యర్థులైరి. వారి అవివేక హృదయము అంధకారమయమాయెను. తాము జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులైరి. వారు అక్షయుడగు దేవుని మహిమను క్షయమగు మనుష్యుల యొక్కయు, పక్షుల యొక్కయు, చతుష్పాద జంతువుల యొక్కయు, పురుగుల యొక్కయు ప్రతిమా స్వరూపముగా మార్చిరి. ఈ హేతువుచేత వారు తమ హృదయముల దురాశలను తమ శరీరములను పరస్పరము అవమానపరచుకొనునట్లు దేవుడు వారిని

అపవిత్రతకు అప్పగించెను. అట్టివారు దేవుని సత్యమును అసత్యమునకు మార్చి సృష్టికర్తకు ప్రతిగా సృష్టమును పూజించిసేవించిరి. యుగముల వరకు ఆయన స్తోత్రార్హుడై యున్నాడు. ఆమేన్" అని అపొ.పౌలు చెప్పెను (రోమా 1:21-25). విగ్రహారాధకులు అగ్ని గంధకములతో మండు గుండములో పాలు పొందుదురు, ఇది రెండవ మరణము అని ప్రకటన 21:8 చెప్పుచున్నది.

మోసగించబడినవారు: యేసు తన కాలమునాటి మత నాయకులను గూర్చి ఇట్లు చెప్పెను: "వారి జోలికిపోకుడి; వారు గ్రుడ్డివారైయుండి గ్రుడ్డివారికి త్రోవచూపువారు. గ్రుడ్డివాడు గ్రుడ్డివానికి త్రోవచూపిన యెడల వారిద్దరు గుంటలో పడుదురు గదా" (మత్తయి 15:14). వీరు సత్యమును గూర్చి ఎరుగని వారు. ఏలయనగా వారు అబద్ధ బోధకులననుసరించినవారు. బైబిలు బోధించు రక్షణ సంకల్పమును అర్థము చేసికొనుట తేలికయే.

నిర్లక్ష్యము చేయువారు: కొందరు దేనిని గూర్చి పట్టించుకోరు: సత్యాన్ని తెలిసికొనగోరరు. ఈలోక సంగతులే వారికి ఇష్టం. ఆత్మీయ సంగతులంటే వారికి అలక్ష్యం. అందువలన వారు నాశనమునకు పోవు విశాల మార్గములో పయనించు చున్నారు (మత్తయి 7:13,14). కాబట్టి ఉదాసీనులైన వారు ఎట్లు నశింతురో మనము ఇట్టే గ్రహించగలము.

అజ్ఞానులు రక్షించబడితే సువార్త నిష్ప్రయోజనమౌతుంది. నమ్ము ప్రతివానిని రక్షించుటకు సువార్త దేవుని శక్తియైయున్నది. (రోమా 1:16). సువార్తను విననివారు రక్షించబడితే, మనము గొప్ప ఆజ్ఞకు లోబడనక్కరలేదు, ప్రజలకు సువార్త ప్రకటించనక్కరలేదు. అజ్ఞానులు తమ అజ్ఞానంలో రక్షించబడితే దేవుడు అన్యాయస్థుడగును. అయితే పాపులు నశించిపోతే అది దేవుని పొరబాటుకాదు. పాపులను రక్షించుటకు దేవుడు చేయవలసినదంతా చేసాడు. తన ఏకైక కుమారుని బలి యిచ్చి తన ప్రేమను ప్రకటించాడు (యోహాను 3:16; రోమా 5:6-8). సువార్తను విని, విశ్వసించి దానికి లోబడే బాధ్యత మనది. క్రీస్తు తన గొప్ప ఆజ్ఞను

సంఘమునకిచ్చారు. ఏలయనగా ఈలోకమంతా పాపములో నిండి యున్నదని ఆయన ఎరుగును. సువార్త ప్రకటింపబడక పోతే, మానవులు విని విశ్వసించి, లోబడకపోతే నిత్యనాశనమునకు గరియగుదురని ఆయన ఎరుగును (మార్కు 16:15,16).

- ఇయన్ (TFW )

## నీవు తెలిసికోవలసిన సంగతులు

బైబిలులో సంఘము దిగువ రీతులుగ పిలువబడినది:

| | |
|---|---|
| దేవుని ఆలయము | 1 కొరింథీ 3:16 |
| క్రీస్తు వధువు | ఎఫెసీ 5:22-32 |
| క్రీస్తు శరీరము | కొలస్స 1:18,24; ఎఫెసీ 1:22-23. |
| దేవుని కుమారుని రాజ్యము | కొలస్స 1:13. |
| దేవుని మందిరము | 1 తిమోతి 3:15. |
| దేవుని సంఘము | 1 కొరింథీ 1:2. |
| జ్యేష్ఠుల సంఘము | హెబ్రీ 12:23 |
| ప్రభువు సంఘము | అపొ.కా 20:28 |
| క్రీస్తు సంఘములు | రోమా 16:16. |

సంఘము :

| | |
|---|---|
| క్రీస్తుచే నిర్మించబడినది. | మత్తయి 16:18 |

క్రీస్తు రక్తముచే కొనబడినది. అపొ.కా. 20:28

క్రీస్తు అను ఒకే పునాదిపై నిర్మించబడినది. 1కొరింథీ 3:11.

పేతురు, పౌలుల మీదగాని, మరియే మానవునిపై గాని అది నిర్మించబడలేదు. 1కొరింథీ 3:12-13.

రక్షింపబడినవారిని ప్రభువు దానితో చేర్చుతాడు. రక్షింపబడినవారితో అది సమకూడినది. అపొ.కా. 2:47.

సంఘసభ్యులు ఈ దిగువరీతిని పిలువబడిరి :

| | |
|---|---|
| క్రీస్తు అవయవములు. | 1కొరింథీ 12:27; 6:15; రోమా 12:4,5 |
| క్రీస్తు శిష్యులు. | అపొ.కా. 6:1, 7; 11:26 |
| విశ్వాసులు. | అపొ.కా. 5:14; 2కొరింథీ 6:15 |
| పరిశుద్ధులు. | అపొ.కా. 9:13; రోమా 1:7; ఫిలిప్పీ 1:1. |
| యాజకులు. | 1పేతురు 2:5,9; ప్రకటన 1:6. |
| దేవుని కుమారులు. | గలతీ 3:26,27; 1యోహాను 3:1,2. |
| క్రైస్తవులు. | అపొ.కా. 11:26; 26:28; 1పేతురు 4:16. |

ప్రభువైన యేసుక్రీస్తు :

సంఘమును ప్రేమించాడు. ఎఫెసీ 5:25.

సంఘము కొరకు తన రక్తాన్ని చిందించాడు. అ.కా. 20:28.

సంఘాన్ని స్థాపించాడు. మత్తయి 16:18.

రక్షింపబడినవారిని సంఘముతో చేర్చును. అపో.కా. 2:47.

సంఘమునకు శిరస్సై యున్నాడు. ఎఫెసీ 1:22,23; 5:23.

సంఘమును రక్షించును. ఎఫెసీ 5:23.

మానవుడు :

సంఘాన్ని సంకల్పించలేదు. ఎఫెసీ 3:10,11.

కొనలేదు. అపో.కా. 20:28; ఎఫెసీ 5:25.

సభ్యులకు పేరు నివ్వలేదు. యెషయా 56:5; 62:2; అపో.కా. 11:26.

సంఘముతో సభ్యులను చేర్చలేదు. అపో.కా. 2:47; 1కొరింథీ 12:18.

సంఘబోధను నెలకొల్పలేదు. గలతీ 1:8-11; 2యోహాను 9:11.

సంఘములో ప్రవేశించడానికి నీవు :

యేసుక్రీస్తు నందు విశ్వసించాలి. హెబ్రీ 11:6; యోహాను 8:24; అపో.కా. 16:31.

నీ పాపముల విషయమై మారుమనస్సునొందాలి. లూకా 13:3; అపో.కా. 2:38; 17:30

యేసునందలి విశ్వాసము నొప్పుకొనాలి. మత్త 10:32; అపో.కా. 8:37, రోమా 10:9,10.

బాప్తిస్మమునొందాలి. మత్తయి 28:19; మార్కు 16:16; అపో.కా. 2:38; 10:48; 22:16.

బాప్తిస్మమునకు ఈ దిగువ సంగతులు అవుసరము :

| | |
|---|---|
| విస్తారమైన నీళ్లు. | యోహాను 3:23; అపొ.కా. 10:47. |
| నీటిలోనికి వెళ్లుట. | అపొ.కా. 8:36-38. |
| నీటిలో సమాధి. | రోమా 6:3-4; కొలస్స 2:12. |
| ఒక పునరుత్థానము. | అపొ.కా. 8:39; రోమా 6:4; కొలస్స 2:12. |
| ఒక జననము. | యోహాను 3:3-5; రోమా 6:3-6. |
| ఒక స్నానము. | అపొ.కా. 22:16; హెబ్రీ 10:22. |

బాప్తిస్మము వలన :

నీవు పాపముల నుండి రక్షించబడుదువు. మార్కు 16:16; 1పేతురు 3:21.

నీవు పాపక్షమాపణ పొందుదువు. అపొ.కా. 2:38.

క్రీస్తు రక్తములో నీ పాపములు కడుగబడును. అపొ.కా. 22:16; హెబ్రీ 9:22; 10:22; 1పేతురు 3:21.

నీవు సంఘములో ప్రవేశింతువు. 1కొరింథీ 12:13; అపొ.కా. 2:47.

నీవు క్రీస్తులో ప్రవేశింతువు. గలతీ 3:26-27; రోమా 6:3-4.

క్రీస్తును ధరించుకొని దేవుని కుమారుడవగుదువు గలతీ 3:26-27.

నూతన జీవితము కలిగినడుచుకొందువు. రోమా 6:3-6.

నీవు తిరిగి జన్మింతువు, ఒక నూతనసృష్టి. రోమా 6:3-4; 2కొరింథీ 5:17.

నీవు క్రీస్తుకు విధేయుడవుగుదువు. మార్కు 16:15-16; 2థెస్స 1:7-9.

సమ్మతమైన సంఘము :

ఆత్మతోను సత్యముతోను ఆరాధించును. యోహాను 4:23-24.

ప్రతి ఆదివారమున కూడుకొనును. అపో.కా. 20:7; హెబ్రీ 10:25.

ప్రార్ధన చేయును. యాకోబు 5:16; అపో.కా. 2:42; 1థెస్స 5:17.

పాటలు పాడును. ఎఫెసీ 5:19; కొలస్స 3:16.

వాక్యోపదేశము చేయును. 1తిమోతి 4:2; అపో.కా. 2:42.

ప్రతి ఆదివారమున ప్రభురాత్రి భోజనము నాచరించును. అపో.కా. 20:7; 1కొరింథీ 11:20-32.

ఉత్సాహముతోను, ధారాళముగను కానుకలిచ్చును. 1కొరింథీ 16:1-2; 2కొరింథీ 8:1-5; 9:6-8.

క్రొత్తనిబంధనలో :

ఒకే ఒక్క దేవుని కుటుంబమున్నది. ఎఫెసీ 3:15; 1తిమోతి 3:15.

ఒకే ఒక్క రాజ్యమున్నది. మత్తయి 16:18-19; కొలస్స 1:13-14.

ఒకే ఒక్క క్రీస్తు శరీరమున్నది. కొలస్స 1:18; ఎఫెసీ 1:22,23; 4:4.

ఒకే ఒక్క క్రీస్తు వధువున్నది. రోమా 7:1-7; ఎఫెసీ 5:22-32.

ఒకే ఒక్క క్రీస్తు సంఘమున్నది. మత్తయి 16:18; ఎఫెసీ 4:4.

# ఇచ్చుట
## ( Giving )

క్రైస్తవ్యము ఇచ్చే మతమైయున్నది. "దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). దేవుడు మనలను ఎంత ప్రేమించెనంటే మనకొరకు తన కుమారుని బలిగా యిచ్చాడు. దేవుడు ప్రేమించాడు, యిచ్చాడు. ఇయ్యగలిగిన వాటన్నిటికంటె ఘనమైనదానిని ఆయన మనకు ఇచ్చాడు. మనం ప్రేమించువారికి అవీ, ఇవీ ఇస్తాము. గాని దేవుడైతే తన ఏకైక కుమారునినే మనకొరకు యిచ్చాడు. దీనిలో అత్యంత ప్రేమయున్నది. అందువలననే "పుచ్చుకొనుటకంటె ఇచ్చుట ధన్యము" అని యేసుప్రభువు బోధించారు (అపో.కా. 20:35). మేలైన దానిని మనం పొందాలంటే ఇచ్చుటలోనే పొందగలం.

క్రైస్తవ్యం వ్యాప్తిజెందునట్లు, క్రీస్తుసంఘం వ్యాపించునట్లు క్రైస్తవులు కానుకలు ఇచ్చుట అత్యావసరం. ఇవ్వడం క్రైస్తవ్యం యొక్క ముఖ్యాంశమై యున్నది. మన ఆత్మల రక్షణ ఈ గొప్ప పునాదిపై నిర్మించబడింది. నైతికంగా సద్వర్తన కలిగి యుండుట ఎంత ప్రాముఖ్యమో, యిచ్చుట కూడ అంతే ప్రాముఖ్యమని ప్రతి క్రైస్తవుడు గ్రహించాలి. దానియొక్క భావాన్ని మనం గ్రహించలేనంత వరకు క్రైస్తవునిగా యుండుట ఏమిటో మనం గ్రహించలేము.

కానుకలు ఇచ్చుట ఆదిమ క్రైస్తవుల ఆరాధనలో ఒక భాగమైయున్నది. కొరింథులోని క్రైస్తవులకు అపో.పౌలు ఇట్లు వ్రాసాడు: "నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తనయొద్ద కొంత సొమ్ము నిలువచేయవలెను" (1కొరింథీ 16:2). క్రైస్తవులు ప్రతి

ఆదివారమున దేవుని ఆరాధించుటకు కూడుకొంటారు. ఆరాధనలో వారు దేవునికి స్తుతి గీతములు పాడతారు, ప్రార్ధన చేస్తారు. వాక్యోపదేశం జరిగిస్తారు. ప్రభువు రాత్రి భోజనంలో పాలు పొందుతారు. కానుకలు యిస్తారు. ఇది సత్యారాధన. ఇది ఆత్మతోను సత్యముతోను చేసే దేవుని ఆరాధన. క్రైస్తవులు దేవుని ఆరాధించుట ద్వారా అత్యున్నత అభ్యుదయాన్ని పొందాలని దేవుడు కాంక్షించుచున్నాడు. ఆరాధించుట ద్వారా మనం శ్రేష్టమైన మానవులం కావాలని ప్రభువు కోరుచున్నాడు. కానుకలు ఇచ్చుటద్వారా మనం ఈ శ్రేష్టత్వాన్ని పొందగలం.

బైబిలులో మనం దేవుని గూర్చి, క్రీస్తును గూర్చి చదువునప్పుడు వారెల్లప్పుడు ఇచ్చుచున్న వారిగనే మనకు కనబడతారు. బైబిలులోని మొదటి పుస్తకాలలో దేవుడు ఎల్లప్పుడు ఇచ్చుచున్న దేవునిగ కనబడతాడు. ఏదెను వనంలో దేవుడు మానవునికి అనేక సంగతులనిచ్చాడు. మానవునికాయన ఒక తోటనిచ్చాడు. అతని నిత్యావసరాలను తీర్చుకోడానికి అవుసరమైన సంగతులన్నిటిని యిచ్చాడు. సృష్టి జరిగిననాటి నుండి మన దేవుడు ఇచ్చువాడై యున్నాడు. గాలిని, నీటిని, సూర్యశ్మిని మనకు ఉచితంగానే ఆయన యిచ్చుచున్నాడు. సీనాయి కొండమీద ఆయన ఇశ్రాయేలీయులకు మోషే ధర్మశాస్త్రాన్నిచ్చాడు. కల్వరి కొండమీద మానవులందరి కొరకు ఆయన అద్వితీయ కుమారుడైన క్రీస్తునిచ్చాడు. గనుక బైబిలు అంతటిలోను ఆయన మనకు ఇచ్చుచున్న దేవుడై యున్నాడు. దేవుడు యిచ్చు దేవుడు గనుక మానవులకంటె ఎంతో శ్రేష్టుడు.

యేసుక్రీస్తు సువార్త సేవను చూచిన యెడల ఇదే సూత్రం ఆయన జీవితంలో కూడ మనకు కన్పడతాది. "నక్కలకు బొరియలును ఆకాశపక్షులకు నివాసములును కలవు. గాని మనుష్యకుమారునికి తల వాల్చుకొనుటకైనను స్థలము లేదని" యేసుప్రభువు చెప్పారు (లూకా 9:58). యేసుప్రభువు ఎల్లప్పుడు మేలునే చేసాడు. ఆయన మానవులకు ఎల్లప్పుడు ఇచ్చుచునే యున్నాడు. ఆయన కుంటివారికి నడువ శక్తి నిచ్చాడు., గ్రుడ్డివారికి చూపునిచ్చాడు, మూగవారు మాట్లాడునట్లు చేసాడు, చెవిటివారికి వినేశక్తి నిచ్చాడు, రోగులకు ఆరోగ్యాన్నిచ్చాడు,

కుష్ఠువారిని శుద్ధులుగా చేసాడు, చివరకు చనిపోయినవారికి జీవాన్ని తిరిగి యిచ్చాడు. మరీ ముఖ్యంగా మానవులను పాపమునుండి విమోచించుటకు తన్ను తాను సిలువపై అర్పించుకొన్నాడు. అందుకే అపొ.పౌలు ఇట్లు జ్ఞాపకం చేయు చున్నాడు: "మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురు గదా? ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యమువలన ధనవంతులు కావలెనని మీ నిమిత్తము దరిద్రుడాయెను (2కొరింథీ 8:9). యేసు ఆదినుండియు దేవునితో యున్నాడు, దేవుడైయున్నాడు. అయినను ఆయన పరలోక ఐశ్వర్యమును విడనాడి మానవ అవతారమును ధరించి మనము ధనవంతులమగునట్లు దారిద్ర్యమును వహించాడు. మన క్షేమం నిమిత్తం ఆయన పరలోక సౌకర్యాలను విసర్జించాడు. "ఆయన సమస్తమైన దుర్నీతినుండి మనలను విమోచించి, సత్క్రియల యందాసక్తిగల ప్రజలను తనకోసరము పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్నుతానే మనకొరకు అర్పించుకొనెను" (తీతు 2:14). క్రీస్తు మనకోసరం తన్నుతాను అర్పించుకొన్నాడు. యివ్వడం దేవుని లక్షణం.

క్రైస్తవుడైన ప్రతివాడును దేవస్వభావమందు పాలివాడు కావాలని ప్రభువు కోరుచున్నాడు. యివ్వడం దేవుని లక్షణం గనుక ఈ దైవలక్షణాన్ని మనం అనుకరించాలి. కేవలం తనను గూర్చి తానే లక్ష్యపెట్టువాడు క్రైస్తవుడుగా యుండ నేరడు. దురాశ, లోభము, స్వార్థము మొదలగు లక్షణాలను కలిగియుండి దేవునివలె ఎవడును ఆత్మీయంగా పెరగలేడు. నిస్వార్థత దేవుని లక్షణమై యున్నది. మనం నిస్వార్థపరుల మయ్యేకొలది దేవుని స్వభావంలో పెరుగగలము. అందువలన దేవుడు కానుకలనిచ్చుటకు ఆరాధనలో భాగంగా చేసాడు.

మనం యిచ్చే కానుకల వెనుక ఉండవలసిన కొన్ని లక్షణాలను, లేక స్వభావాలను క్రొత్త నిబంధన మనకు తెలియజేయుచున్నది. మనం ఈ లక్షణాలు కలిగియుండడం ప్రాముఖ్యమని దేవుడు కోరుచున్నాడు. మొదటిగా ప్రభువు మన శక్తికొలది యివ్వాలని కోరుచున్నాడు. అపొ.కా. 11:28,29లో యూదయ ప్రాంతానికి సంభవించిన కరవును గూర్చి మనం చదువగలము. "అప్పుడు శిష్యులలో ప్రతివాడును

తన శక్తికొలది యూదయలో కాపురమున్న సహోదరులకు సహాయము పంపుటకు నిశ్చయించుకొనెను" అని అపొ.కా. 11:29లో మనం చదువగలము. ప్రతివాడును తన శక్తికొలది యివ్వాలన్న సంగతిని ఇక్కడ మనం గ్రహించుకోగలము.

పాతనిబంధనలో దేవుడు దశమభాగం యివ్వాలని ఇశ్రాయేలీయులను కోరినట్టు మనం చూడగలము. అందుకే క్రొత్తనిబంధనలో మనం ఎన్నోవంతు యివ్వాలో చెప్పబడలేదు గాని ప్రతివాడు తాను వర్ధిల్లినకొలది యివ్వాలని చెప్ప బడింది. ప్రతివాడు ప్రభువుకు ఎంత యివ్వాలనేది తనకు తానే నిశ్చయించుకోవాలి. మన ఆత్మీయాభివృద్ధితో మనం యిచ్చే కానుకలు ముడివడి యున్నవి. ప్రతివాడు తన శక్తికొలది యివ్వాలి.

యేసు ఒకనాడు దేవాలయములో యుండగా ధనవంతులైనవారు అనేకులు కానుక పెట్టెలో విశేషముగా సొమ్ము వేయుచుండిరి. ఒక బీద విధవరాలు వచ్చి రెండుకాసులు వేయగా ఆయన తనశిష్యులను పిలిచి కానుక పెట్టెలో డబ్బులు వేసిన వారందరి కంటె ఈ బీద విధవరాలు ఎక్కువ వేసెనని వారితో చెప్పాడు. వారందరు తమకు కలిగిన సమృద్ధిలోనుండి వేసిరిగాని, యీమె తన లేమిలో తనకు కలిగినదంతయు అనగా తన జీవనమంతయు వేసెనని ఆయన చెప్పారు (మార్కు 12:41-44).

2కొరింథీ 9:7లో అపొ.పౌలు మనం ఎట్టి స్వభావంతో యివ్వాలో తెలియజేయుచున్నాడు. "సణుగుకొనకయు బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను; దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును". ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను. ఇచ్చేటప్పుడు సణుగులు గొణుగులు యుండరాదు. ప్రభువు పనికి నేను కానుకలు యివ్వాలి. కానుకలివ్వాలని ప్రభువు కోరుచున్నాడు. గనుక నేను యిస్తానని ఉత్సాహముతో యివ్వాలి. దేవుడు ఉత్సాహముగా ఇచ్చు వానిని ప్రేమించును. "కొంచెము విత్తువాడు కొంచెముగా

పంటకోయును, సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంటకోయును" అని యీ విషయమై చెప్పవచ్చునని అపో.పౌలు వ్రాసాడు (2కొరింథీ 9:6). మనం దేవునికి ఎంత ఎక్కువగా యిస్తే అంత ఎక్కువగా ఆయన మనకు తిరిగి యిస్తాడు. "ఇయ్యుడి, అప్పుడు మీకియ్యబడును; అణచి కుదిలించి దిగజారునట్లు నిండు కొలతను మనుష్యులు మీ ఒడిలో కొలుతురు. మీరు ఏ కొలతతో కొలుతురో ఆ కొలతతోనే మీకు మరల కొలువబడును" అని యేసుప్రభువు బోధించారు (లూకా 6:38). ప్రభువు పని నిమిత్తం క్రైస్తవులు కానుకలివ్వాలి. ప్రతివాడు తాను వర్ధిల్లిన కొలది, తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారం యివ్వాలి.

అన్నిటికంటె ముఖ్యముగా ప్రతి మానవుడు తన్నుతాను దేవునికి అర్పించుకోవాలి. నీవింకా క్రైస్తవుడవు కాకపోతే నీ హృదయాన్ని, జీవితాన్ని, నీ ఆత్మను ప్రభువుకు అర్పించుకోవాలని హెచ్చరించుచున్నాను. యేసుప్రభువునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొంది ప్రభువుకు పూర్తిగా అర్పించుకో. ప్రభువు నిన్ను రక్షించి తన సంఘముతో చేర్చుకొంటాడు. సమస్త ఆత్మీయాశీర్వాదములను నీకు ఆయన యిస్తాడు. ఈనాడే ప్రభువుకు నిన్ను నీవు అర్పించుకో.

- జాషువా గూటం.

## పెంతెకొస్తు నాటి వింత

(అ.కా. 2 అధ్యాయము)

యెరూషలేము పట్టణమంతా కిటకిటలాడుచూ ఏభై రోజుల క్రితమునుండి ఎడతెరిపిలేని అధ్యాత్మిక ఆచారాలతో అలసిపోతూ ఆనంద ప్రవాహములో పండగలను జరుపుకొనుచున్న ఈ ప్రజలు ఏ మతస్థులు? ఎక్కడనుండి వచ్చారు? వీరంతా యూదా మతస్థులు, ఆకాశము క్రిందనుండు ప్రతీ జనములో నుండి వచ్చిన భక్తిగల యూదులు (అ.కా. 2:5). వీరు యాత్రలు చేయుచూ ఏడాదికి

ఒకసారి మోషే ధర్మశాస్త్రానుసారం దేవునిచే నిర్ణయించబడిన యెరూషలేము దేవాలయాన్ని దర్శించవలసి యున్నది. (ద్వి.కా. 12:5-6). ఈరీతిగా ఏటేటా సాగిపోతూ ఉంది. అయితే ఈ యేడు మరొక వింత వాటిల్లింది. పస్కా జరిగిన తరువాత వచ్చే ఏభైయవ రోజు పండగ పెంతెకొస్తు పండగ. దానికొరకు ఈ మతాంధులైన యూదులు ఎదురుచూస్తూ యెరూషలేము పట్టణాన్ని వదలకుండా దేవాలయం చుట్టూ తిరుగుచున్నారు.

అయితే క్రీస్తు సిలువ మరణం పొంది సమాధిచేయబడి మూడవ దినాన్ని లేపబడి నలుబది దినాలపాటు ఆయన తన భక్తుకులకు అగుపడుచు అనేక ప్రమాణ వాక్యాలు చెప్పి ఆయన శిష్యులు చూస్తూ ఉండగా వారి మధ్యనుండి ఆరోహణుడై పరమునకు చేర్చుకొనబడెను.

అయితే శిష్యులు ఆయన ఆజ్ఞను అనుసరించి యెరూషలేము మేడగదిలో పరిశుద్ధాత్మకొరకు కనిపెట్టుచుండిరి. యెరూషలేము పట్టణములో రెండు వర్గాలవారు రెండు అంశముల కొరకు కనిపెట్టుచున్నారు. 1. యూదా మతస్థులు పెంతెకొస్తు పండుగ కొరకు, 2. క్రీస్తు శిష్యులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము కొరకు కనిపెట్టుచున్నారు-ఎవరిపని వారిది.

యూదులకు పెంతెకొస్తు పండగ రానే వచ్చింది. ఇక వారి ఆనందానికి అంతులేదు. అందుకు అవసరమైన అర్పణ ఆచారాదులతో దేవాలయ దర్శనమునకు త్వరపడుచుండ అదేరోజు తెల్లవారుసరికి క్రీస్తు శిష్యులమీదికి పరలోకమునుండి పరిశుద్ధాత్మ దిగెను. గాలివంటి బలమైన శబ్దము అగ్ని నాలుకల వంటి విభాగింపబడిన దృశ్యము ఆత్మ శక్తితో అన్యభాషలు మాట్లాడుట ఇకవెన్నడూ కనివిని యెరుగని అద్భుతశక్తి క్రీస్తు శిష్యుల నావరించినపుడు, తమ అర్పణా చారాదులతో ఆలయానికి పయనమగుచున్న పెంతెకొస్తు పండగ వారంతా తమ పెంతెకొస్తు సందడిని విడిచి, వింతైన వర్తమానం ఏ భాషవారికి ఆ భాషలోనే దేవుని గొప్ప కార్యాలు వివరిస్తున్న క్రీస్తు శిష్యుల దగ్గరకు గుంపులు గుంపులుగా పరుగిడి వచ్చారు. పెంతెకొస్తు పండగ కొరకు పడుగాపులుపడి కాచుకొనియున్న ఈ

పెంతెకొస్తువారు తమ పెంతెకొస్తు పండుగని మర్చిపోయారు. క్రీస్తు శిష్యుడైన పేతురు ప్రసంగాన్ని విన్నారు. హృదయంలో నొచ్చుకొని సత్యాన్ని గ్రహించారు. తమ పెంతెకొస్తు ఆచరణ లేదు. క్రీస్తు తమ విమోచన కర్తయని విశ్వసించారు. అంతేకాదు ఇంచుమించు మూడువేల మంది క్రీస్తు సువార్తకు లోబడియున్నారు (బాప్తిస్మము పొందారు).

పెంతెకొస్తు పండగకొరకు వచ్చిన ఈ పెంతెకొస్తువారు తమ పెంతెకొస్తు ఆచారాలు, పెంతెకొస్తు సిద్ధాంతాలు, పెంతెకొస్తు అర్పణలు, పెంతెకొస్తు ఉత్సవాలు పూర్తిగా విడిచిపెట్టారు. అపొస్తలుల సహవాసం, అపొస్తలుల బోధలలో ఎడతెగకుండా ఉండిపోయారు.

ఇపుడు వారు పెంతెకొస్తువారు కాదు. పెంతెకొస్తు సంఘస్థులూ కాదు గాని వారు క్రీస్తువారు, క్రైస్తవులు, వారు ఏ దేశంలో ఉన్నా ఎన్నిచోట్లలో ఉన్నా వారంతా క్రీస్తుసంఘము వారు మాత్రమే.

క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన వీరు ఇక ఎట్టి పరిస్థితులలోను పెంతెకొస్తు వారని పిలువబడరు. ఈఇరువదవ శతాబ్దములో మేము క్రీస్తును నమ్మినాము, క్రీస్తు మా రక్షకుడని చెప్పుకొనుచూ మేము పెంతెకొస్తువారము, పెంతెకొస్తు సంఘస్థులము అని చెప్పుకొనుట అజ్ఞానము మాత్రమే.

ఒకడు క్రీస్తులోనికి వచ్చిన యెడల అతడు యూదా మత సంబంధమైన పెంతెకొస్తు పండగకు గాని ఆ పేరుకు గాని ఎన్నడూ చెందడు గాని ఆనాటి పెంతెకొస్తులోనుండి క్రీస్తులోనికి వచ్చిన మూడువేలమందితో చేర్చబడు నిమిత్తము మిమ్మును పిలచుచున్నాము (అ.కా. 2:47). క్రీస్తు సంఘములను దర్శించండి.

- పాల్ గూటం, గొల్లవిల్లి.

# యేసును ఏమి చేతును ?

## ( What shall I do with Jesus )

(మత్తయి 27:11-22)

పరిచయము :

1. ఈ ప్రశ్న సార్వజనికమైనది. అన్ని జనాంగములవారు తరగతుల వారు అడిగే ప్రశ్న యిది.

2. క్రీస్తు యేసును గూర్చి సత్యాన్ని నేర్చుకొన్నవాడు మార్పు జెందకుండా యుండలేడు.

ఈ ప్రశ్నలో ఇమిడియున్న కొన్ని సంగతులు :

1. బాధ్యత గలవాడెవడు ఈ ప్రశ్నను నిర్లక్ష్యము చేయలేడు (మత్తయి 12:30).

2. మానవునికి దేవునికిగల ఒకేఒక్క మధ్యవర్తి ఆయనే గనుక ఈ ప్రశ్న గంభీరమైనది (1తిమో 2:5; హెబ్రీ 1:1,2).

3. యేసు మానవుని ఏకైక రక్షకుడు (మత్తయి 1:21). మన పరిపూర్ణ మాదిరి (1పేతురు 2:21).

4. తీర్పులో మనం ఎదర్కొనే ప్రశ్న (యోహాను 12:48).

యేసును కొందరు ఏంచేసారు ?

1. గొర్రెల కాపరులు ఆయనదగ్గరకు ఆకర్షింపబడ్డారు (లూకా 2:1-16)

2. జ్ఞానులు ఆయనను ఆరాధించారు (మత్తయి 2:1, 2,11).

3. హేరోదు ఆయనను చంపజూచాడు (మత్తయి 2అధ్యాయము).

4. కొందరాయన మాటల్లో తప్పుపట్టాలనుకున్నారు (మత్తయి 22:23-30).

5. ఆయన స్వకీయులే ఆయనను అంగీకరించలేదు (యోహాను 1:11).

6. ఇస్కరియోతు యూదా ఆయనను అప్పగించాడు (మత్తయి 26:14-16).

7. పేతురు ఆయనను ఎరుగనన్నాడు (మత్తయి 26:69-75).

8. పిలాతు తటస్థంగా యుండాలనుకున్నాడు మత్తయి (27:24).

9. సౌలు ఆయనను హింసించాడు (అపొ.కా. 9:1-6).

ముగింపు :

1. ఒకానొక దినమందు ఆ ప్రశ్న తిరుగ వేయబడును: "యేసునిన్ను ఏమి చేయును ?"

2. ఇప్పుడాయన మనముందాన్నాడు, ఆయనను మనం ఏమి చేతుమో ఇప్పుడే నిశ్చయించుకోవాలి (ప్రకటన 3:20).

3. మనందరం ఆయనముందు నిబడే రోజు వచ్చుచున్నది. మనల్ని ఏమి చేయాలో అప్పుడాయనే నిర్ణయిస్తాడు (2కొరింథీ 5:10).

4. యేసు దేవుని కుమారుడని విశ్వసించు, నీపాపముల విషయమై మారుమనస్సు పొందు, ఆయన్ను ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందు (యోహాను 8:24; అపొ.కా. 17:30; రోమా 10:9; అపొ.కా. 2:38).

- లీరోయ్ బ్రౌన్‌లో.

జాన్‌ఫోర్డు గారి సతీమణి నేన్సీఫోర్డు గారు ఐరాన్‌రైస్ గారి సతీమణి వాడారైస్ గారు డార్సిట్రా గారి సతీమణి ఓలాట్రా గారు స్త్రీలకు బైబిలు తరగతులు మధ్యాహ్న సమయములో జరిగించిరి. వారి పాఠములను తెలుగులో సోదరి జెస్సీ జేసన్ గారు, చక్కగా అనువదించిరి. నేన్సీఫోర్డు గారు రచించిన "నీరు కట్టిన తోటలు" అను పొత్తమును సోదరి నలిని గూటం గారు సరళమైన శైలిలో తెలుగులోనికి అనువదించగా దానిని స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ వారు ముద్రించి వాటిని వేలకొలది ప్రజలకు ఉచితముగా అందించిరి.

ఆంగ్ల గీతములు పాడినడిపించుటలో జాన్‌ఫోర్డు గారు, డేన్‌ఫోర్డు గారు, ఐరాన్‌రైస్ గారు జేసన్ రాబర్ట్ గారు, ఫ్రాన్సిస్ డేవిడ్ గారి కుమారుడు వినయ్ డేవిడ్ (న్యూఢిల్లీ) గారు స్వామిదాస్ గారు, నెహెమ్యా గూటం గారు, రాజర్ రైట్ గారు గొప్ప పాత్ర నిర్వహించిరి. అదేరీతిగా గంటా ఫిలిప్పు గారు, Ch.సద్గుణరావ్ గారు, T.Ch.ఫ్లెమింగ్స్ గారు, రమేష్ గారు A. ఆనంద్ గారు చిన్నయ్య గారు తెలుగుపాటలు నడిపించుటలో ఘనమైన పాత్ర నిర్వహించిరి.

సోదరులు నెహెమ్యా గూటం గారు, పీటర్ గూటం గారు సమయోచితముగా సమర్ధవంతముగాను సెమినార్ కార్యక్రమములను నడిపించిరి. అనారోగ్యకారణంగా సోదరులు జాషువా గూటం గారు అన్ని దినములు హాజరు కాలేకపోయినను మొదటి దినమున హాజరై దేవుని స్తుతించిరి.

సెమినార్ జరిగిన ఆరు రోజులలో మొత్తం 175 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. 12 వ తేదీ ఉదయం కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లో బైబిలు శిక్షణ పొందిన వారికి స్నాతకోత్సవ వేడుక అత్యంత వైభవముగా జరిగెను. ఆ స్నాతకోత్సవ సమావేశమునకు థాయ్‌లాండ్ క్రీస్తు సంఘ సువార్తికులు డార్సిట్రా గారు ముఖ్య అతిధులుగా ఆహ్వానించబడిరి. 2 సంవత్సరముల, 3సంవత్సరముల కోర్సు పూర్తిచేసిన 20మంది విద్యార్థులకు జాన్ ఫోర్డు గారి చేతులమీదుగా పట్టా ప్రదానము గావించ బడెను. 6 వారముల కోర్సు పూర్తిచేసిన కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ విద్యార్థులకు, 3నెలల కోర్సు పూర్తిచేసిన వరంగల్ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేయబడెను. విద్యార్థులను ఉద్దేశించి ఐరాన్‌రైస్ గారు, జాన్ ఫోర్డు గారు,

డార్విట్రా గారు బైబిలునుండి మంచి హెచ్చరికలను ఇచ్చి వారిని ప్రోత్సహించి అభినందించిరి. ఉత్తమ క్రమశిక్షణను, ఉత్తమశ్రేణిని, ఉత్తమ హాజరును పొందిన వారికి డార్విట్రా గారి చేతుల మీదుగా బహుమతులు ఇయ్యబడెను. సోదరి నేన్సీఫోర్డు, వాడారైస్ గారి చేతుమీదుగా గ్రాడ్యుయేషన్ విద్యార్థులందరికీ బహుమతులు అంద జేయబడెను. వేలమందికి ఆహారము వడ్డించుటలో స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ విద్యార్థులు ఉపాధ్యాయులు పి. చంద్రశేఖర్, టి. నోబుల్,ఆనంద్ రాజు, బి.తాతారావు ,మోహన్‌రావు, ఫిలిప్పు, రాకేష్‌చంద్ర, సీఫాస్‌దీప్ గార్లు నిర్విరామ కృషిని సల్పిరి.

—డిశంబరు 12వ తేదీ ఉదయకాల సమావేశానంతరము సెమినార్ మరియు ఏషియన్ బైబిల్ లెక్చర్ షిప్ దిగ్విజయముగా ముగిసెను. వచ్చిన వారందరూ అత్యానందభరితులై .ఇంత చక్కగా జరుగుటకు సహాయాన్ని అందించిన దేవుని స్తుతించుచు, ఇది ఇంత గొప్పగా జరిపించిన స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ డైరక్టర్ నెహెమ్యా గూటం గారిని అభినందించుచూ తమ గ్రామములకు పట్టణములకు తిరిగి వెళ్లిరి.

---

**Regd. No. H / KD-45 / K.D. H.O**
**Date of Posting : 15 th of Every month**

**From:**
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA - 533 001

**To**